సాక్షి విశాఖపట్నం

బుధవారం । 23 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

ఏయూతో కెనడా సంస్థ ఎంవోయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కెనడాకు చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ సీఈవో డాక్టర్ వినయ్ సింఘులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. అవగాహన ఒప్పందంలో భాగంగా డిజిటల్ థెరపీ సెంటర్ ఏర్పాటు చేయడం, పరిశోధకులకు ఉచిత శిక్షణ అందించడం, రూ.10 లక్షలు విలువైన థెరపీ లెసెన్స్ ఏయూకు అందించనుంది. రెండు సంస్థలు సంయుక్తంగా విద్య, బోధన, పరిశోధన సంబంధ అంశాలలో కలసి పనిచేయాలని నిర్ణయించారు.

జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్‌కు సాయి కౌషిక్



విశాఖ స్పోర్ట్స్ : జాతీయ స్థాయి ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలకు విశాఖ కుర్రాడు సాయి కౌషిక్ అర్హత సాధించాడు. ఈ పోటీలు నవంబర్‌లో భోపాల్‌లో జరగనున్నాయి. ఇటీవల కేరళలో జరిగిన అండర్ 16 సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఏపీ తరుపున పాల్గొని 400 పాయింట్లకు 383 పాయింట్లతో నిలిచాడు. ఎయిర్ రైఫిల్ షూటింగ్ 10 మీటర్ల సబ్ యూత్ మెన్ విభాగంలో తలపడి పదో ర్యాంక్‌లో నిలిచి అర్హత సాధించాడు.

రోడ్ షో నేడు

దొండపర్తి: కేంద్ర పోర్టులు, నౌకాయాన, జల రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 17 నుంచి 19 వరకు ఢిల్లీలో జరగనున్న గ్లోబల్ మారీటైం ఇండియా సమ్మిట్‌ను పురస్కరించుకుని బుధవారం ఉదయం 11 గంటలకు నోవోటెల్ వద్ద రోడ్ షో నిర్వహించనున్నట్టు విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర షిప్పింగ్ మంత్రి శర్బానంద సోనోవాల్ వీడియో సందేశాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ రోడ్ షోలో కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, ఏపీ మారిటైం, విశాఖ జిల్లా ఉన్నతాధికారులు, స్టీవ్ డోర్స్, స్టేక్ హోల్డర్స్ పాల్గొంటారని తెలిపారు. విశాఖపట్నం పోర్టు.. ప్రభుత్వ, ప్రైవేట్ ఏజెన్సీలతో సుమారు రూ.34 వేల కోట్ల విలువైన పెట్టుబడుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగే సదస్సులో వాటికి సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేయనున్నట్లు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర సదస్సుకు ఆహ్వానం



స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు

మద్దిలపాలెం (విశాఖతూర్పు): స్కౌట్స్‌అండ్ గైడ్స్ రాష్ట్ర సదస్సు ఈనెల 25వ తేదీన గుంటూరు తాడికొండలో నిర్వహిస్తున్నారని, ఈ సదస్సుకు తనకు ఆహ్వానం అందిందని స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సమావేశానికి చీఫ్ కమిషనర్‌తోపాటు, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీకి చెందిన జెన్నిఫర్ షైనీ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. సోమవారం స్కూల్‌కి వెళ్లి తిరిగి ఇంటికి రావపోవడంతో తల్లిదండ్రులు, పోలీసులు అంతటా గాలించారు. చివరకు ఏలూరు వైపు వెళ్తున్న రైల్లో బాలిక ఒంటరిగా ఉండడాన్ని ప్రయాణికులు గమనించి.. జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు కంచరపాలెం స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు బాలికను ఇక్కడకు తీసుకొచ్చి.. ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హాజరు పక్కా

- వైద్య సిబ్బంది అటెండెన్స్‌పై నిఘా
- విధులకు సవ్యంగా హాజరు కాకపోతే జీతం కట్
- సెప్టెంబర్ నుంచి అమలుకు శ్రీకారం



మహారాణిపేట : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, ఇతర సిబ్బంది సమయపాలన పాటించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. తద్వారా వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ, విక్టోరియా ఆస్పత్రి (ఘోషా), ఇతర ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది నూరు శాతం విధులకు హాజరు అయ్యేవిధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం అన్ని ఆస్పత్రుల్లో అటెండెన్సీ రిజిస్టర్, ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏఈబీఏఎస్), ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్ఆర్ఎస్) అమలులోకి తెచ్చారు. ప్రస్తుతం అన్ని చోట్ల ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ అమలులో వుంది. ఇప్పుడు అన్ని ఆస్పత్రుల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ అమలులోకి తెచ్చారు. దీని వల్ల వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండడం వల్ల... ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుందని భావిస్తున్నారు.

నూరు శాతం హాజరు లక్ష్యం

వచ్చే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి నూరు శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ ఖచ్చితంగా అమలు చేయాలని అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా అటెండెన్స్‌కు జీతాలను అనుసంధానం చేశారు. వచ్చేనెల నుంచి వైద్య ఆరోగ్యశాఖలో అందరికీ ఎఫ్ఆర్ఎస్ హాజరు ప్రకారం జీతాలు చెల్లిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆలస్యం అయినా, ఎఫ్ఆర్ఎస్ వేయకపోయినా తొలుత లీవుగా పరిగణిస్తారు. ఆ తర్వాత అన్ని సెలవులూ పూర్తి అయితే నెల వారీ జీతంలో కోత విధించడానికి వెనుకాడ వద్దని, వీటిని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత హెచ్‌వోడీలు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ హాజరును డిస్ట్రిక్ట్ మాన్యువల్ (డీఎంవో) కమిటీ కూడా పర్యవేక్షిస్తుంది. ఎవరైనా గైర్హాజరైనా, ఆలస్యమైనా సంబంధిత ఉద్యోగులకు సమాచారం వెళ్లేలా అలర్ట్ మెకానిజం కూడా సిద్ధం చేశారు.

ఇవీ మార్గదర్శకాలు

రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది తప్పనిసరిగా విధి నిర్వహణలో భాగంగా ఆస్పత్రుల్లో ఉండాలి. ఉదయం కార్యాలయానికి వచ్చిన వెంటనే అటెండెన్సీ రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏఈబీఏఎస్)లో అయితే రోజుకు రెండు సార్లు బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. ఉదయం 9 గంటలకు ఒక సారి, డ్యూటీ పూర్తయిన తర్వాత సాయంత్రం 4 గంటలకు మరోసారి బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. అదే ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్ఆర్ఎస్)లో అయితే రోజుకు మూడు సార్లు హాజరు వేయాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం నాలుగుకు... మొత్తంగా రోజులో మూడు సార్లు ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా హాజరు వేయాల్సి ఉంది. ఈ పద్ధతిలో ఎవరి సెల్‌ఫోన్‌లో వారు హాజరు నమోదుకు కూడా యాప్ సిద్ధం చేశారు. దీని వల్ల సిబ్బంది ఎక్కడ ఉన్నారో లొకేషన్ కూడా నమోదవుతుంది. దాని వల్ల ఎక్కడి నుంచి హాజరు వేస్తున్నారో సులువుగా తెలుస్తుంది. వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది కేజీహెచ్‌లో 1,699 మంది, ఆంధ్రా మెడికల్ కాలేజీలో 616 మంది, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో 294 మంది కలిపి... మొత్తంగా మూడు ఆస్పత్రుల్లో 2,609 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

నిఘా పెంచుతాం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వైద్యులు, ఇతర సిబ్బంది హాజరుపై నిఘా పెంచుతాం. విధులకు హాజరైన వారు తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేసుకోవాల్సి ఉంది. ఆస్పత్రిలో హాజరు వేసుకోవడానికి కూడా ఏర్పాట్లు చేశాం. ఈ మేరకు అందరికీ సర్క్యులర్ ద్వారా తెలియజేస్తాం.

– డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

రోజులో మూడుసార్లు హాజరు..



ఎఫ్ఆర్ఎస్ ద్వారా అందరూ తప్పనిసరిగా అటెండెన్స్ వేసుకోవాలి. ఇలా హాజరు వేసుకుంటేనే జీతం వచ్చేది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విధుల్లో ఉండాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం... రోజులో మూడు సార్లు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేసుకోవాలి.

– డాక్టర్ బుచ్చిరాజు, ప్రిన్సిపాల్, ఆంధ్ర మెడికల్ కాలేజీ, విశాఖపట్నం

విశాఖలో 'గాండీవధారి అర్జున'

విశాఖలో గాండీవధారి అర్జున చిత్ర యూనిట్ సందడి చేసింది. హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ సాక్షి వైద్య చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. స్పై యాక్షన్ బ్యాక్ డ్రాప్‌లో ప్రవీణ్ సత్తార్ దర్శకత్వంతో తెరకెక్కిన ఈ చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఒక సైనికుడిగా సైంటిస్ట్‌గా, ఒక మంచి లవర్ బాయ్ పాత్రలో విభిన్న షేడ్స్ ఉన్న మంచి పాత్ర లభించిందని వరుణ్‌తేజ్ చెప్పారు. వైజాగ్‌లో ప్రజలు సినిమా ప్రేమికులని, ఇక్కడ టాక్ బాగుంటే సినిమా సూపర్‌హిట్టేనన్నారు.

॥లో



25న ఉపాధి కార్యాలయంలో మెగా జాబ్‌మేళా

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.శాంతి (టెక్నికల్) తెలిపారు. రక్షిత డ్రగ్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మా, ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చర్స్, రక్షిత్ ఫార్మాసూటికల్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 282 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ప్రొడక్షన్ ఆపరేటర్, కెమిస్ట్, ప్రాసెస్ డెవలప్‌మెంట్ ల్యాబ్ కెమిస్ట్, ఫిట్టర్స్, కస్టమర్, అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మాసిస్ట్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, హార్టీకల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, మెకానిక్స్, టెలికాలర్స్, టీం లీడర్స్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్లు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ.12 వేలనుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

బాలలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ చర్యలు

ఆనందపురం : జిల్లాలో వెట్టి చాకిరి బాధితులతో పాటు, పరిశ్రమలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లోని పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లో కార్మిక, పోలీసు, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించారు. వేములవలసలోని ఓ బేకరిలో ఓ బాల కార్మికుడు, వెల్లంకి గ్రామంలోని ప్లైవుడ్ పరిశ్రమలలో ఇద్దరు బాల కార్మికులను గురించి, వారి కుటుంబ వివరాలు, ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వారి అర్హతను బట్టి పాఠశాల లేదా కళాశాలలో చేర్పించడానికి నిర్ణయించారు. బాలలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అధికారులు ఆయా యాజమాన్యాలను హెచ్చరించారు. వెట్టి చాకిరి, బాల కార్మికులు గానీ ఉన్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ బాల కార్మిక నిర్మూలన శాఖ సహాయ సంచాలకుడు పి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, అధికారులు ఎస్.వెంకటరావు, సి.విజయ్‌కుమార్, ఎన్.విజయశ్రీ, సమత, స్వాంతన సేవా సంస్థల ప్రతినిధులు సైమన్, ప్రజ్ఞ కుమార్, జేసుదాసు పాల్గొన్నారు.

షిర్డీ, ఎల్టీటీలకు అదనపు హాల్ట్‌లు

తాటిచెట్లపాలెం: విశాఖ నుంచి రాకపోకలు సాగించే పలు రైళ్లకు ప్రయోగాత్మకంగా అదనపు హాల్ట్‌లు కల్పిస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె. త్రిపాఠి తెలిపారు. విశాఖ-లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి కల్యాణ్ స్టేషన్‌లో హాల్ట్ కల్పించారు. ఈ రైలు ప్రతి రోజూ తెల్లవారు 3.20గంటలకు కల్యాణ్ చేరుకుని, 3.22 గంటలకు బయలుదేరుతుంది. లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయలుదేరే ఈ రైలు(18520) ఈ నెల 23 నుంచి ఉదయం 7.32కు కల్యాణ్ స్టేషన్‌కు చేరుకుని, 7.34 గంటలకు బయలుదేరుతుంది. • విశాఖ-సాయినగర్ షిర్డీ (18503) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24వ తేదీ నుంచి కోపెర్‌గావ్‌లో హాల్ట్ కల్పించారు. ఈ రైలు ప్రతీ గురువారం ఈ స్టేషన్‌కు ఉదయం 9.53 గంటలకు చేరుకుని, 9.55 గంటలకు బయలుదేరుతుంది. తిరిగి షిర్డీలో బయలుదేరే ఈ రైలు ప్రతీ శుక్రవారం రాత్రి 8.08 గంటలకు కోపెర్‌గావ్‌కు చేరుకుని, 8.10 గంటలకు బయలుదేరుతుంది.

అంబరాన్నంటిన జానపద సంబరం

మద్దిలపాలెం : ప్రపంచ జానపద దినోత్సవం అంబరాన్నంటింది. నవచైతన్య కళానాట్య సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంచూరియన్ వైస్ చాన్స్‌లర్ ఆచార్యులు జి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంప్రదాయానికి పట్టుకొమ్మలాంటి జానపదాలో మధురిమనులు భావితరాలకు అందించాలన్నారు. కళనే నమ్ముకుని దానికి కోసం జీవితాలనే అంకితం చేస్తున్న కళాకారుల సేవలకు ప్రశంసనీయమన్నారు. అనంతరం కళాభారతి ట్రస్ట్ చైర్మన్ ఎం.సత్యనారాయణ రాజు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్, ఆకాశవాణి నిర్వహకులు బి.రామసూర్య ప్రకాశరావు తదితరులు మాట్లాడారు.

జానపద నృత్యాల హోరు

నగరం నలుమూల నుంచే కాకుండా విజయనగరం నుంచి తరలి వచ్చిన జానపద కళాకారులు వారి ప్రదర్శనలతో హోరెత్తించారు. దీంతో కళాభారతి ప్రాంగణం జానపద నృత్యాలు గీతాలతో సందడిగా మారింది. మరోవైపు పౌరాణిక పద్యానాటక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు చేసిన జానపద బృంద నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కళలకు సేవలందిస్తున్న పలువుర్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవ చైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం ప్రతినిధులు పి.వీర్రాజు, చిన్నారెడ్డి, వి.ప్రభాకర్, సత్యనారాయణ, మస్తాన్‌రెడ్డి, కొణతాల రాజు, ఎం.ఎస్.మాధవ్, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కళా రంగ ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహకులు

హత్యా.. ఆత్మహత్యా?

- ఇంటర్ విద్య కోసం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన రితీ సాహా
- గత నెల 14న హాస్టల్ భవనం పైనుంచి పడి మృతి
- అనుమానాస్పద మృతిగా నాలుగో పట్టణ పోలీసుల కేసు నమోదు
- తమ కుమార్తెది హత్యే అంటున్న ఆమె తల్లిదండ్రులు
- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఫిర్యాదు



రితీ సాహా (ఫైల్)

దొండపర్తి: ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి కేసు నగర పోలీస్ శాఖలో ప్రకంపనలు రేపుతోంది. తమ కుమార్తెది హత్యేనని, కేసును నీరుగార్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారంటూ విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించడం సంచలనంగా మారింది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యార్థిని రితీ సాహా హాస్టల్ భవనం పైనుంచి పడి మృతి చెందితే.. పశ్చిమ బెంగాల్‌లో నేతాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన రితీ సాహా విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ కాలేజీకి అనుసంధానంగా నెహ్రూబజార్ ప్రాంతంలో ఉన్న సాధనా హాస్టల్‌లో ఉండేది. ఈ క్రమంలో గత నెల 14న హాస్టల్ 4వ అంతస్తు పైనుంచి దూకి చనిపోయిందని తల్లిదండ్రులకు హాస్టల్ యాజమాన్యం సమాచారమిచ్చింది. వెంటనే ఆమె తల్లిదండ్రులు విశాఖకు వచ్చి విగత జీవిగా ఉన్న కుమార్తెను చూసి తల్లడిల్లిపోయారు. అయితే విద్యార్థిని మరణానికి గల కారణాలపై హాస్టల్ సిబ్బంది, పోలీసులు పొంతన లేకుండా చెప్పడంతో వారికి అనుమానం వచ్చింది. ఒకసారి ప్రమాదవశాత్తు కింద పడిపోయిందని, మరోసారి దూకేసిందంటూ చెప్పుకొచ్చారు.

సీసీ ఫుటేజ్‌లతో మరిన్ని అనుమానాలు

రితి సాహా మృతిపై ఒక్కొక్కరు ఒక్కో రకంగా చెబుతుండడంతో ఆమె తల్లిదండ్రులు హాస్టల్‌లో ఉన్న సీసీ కెమెరాలనే కాకుండా దాని ఎదురుగా ఉన్న భవనం సీసీ ఫుటేజీలను కూడా పరిశీలించారు. రితీ సాహా నాలుగో అంతస్తు పైకి వెళ్లే సమయంలో ఒక డ్రెస్‌లో ఉండగా.. కింద పడి ఉన్న మృతదేహంపై మరో కలర్ డ్రెస్ ఉందని గ్రహించినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆ విషయాన్ని పోలీసులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులపై నమ్మకం లేదంటూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఎం సీరియస్ అవడంతో పాటు మంత్రి అనూప్‌ను ఏకంగా రితీ సాహా ఇంటికి పంపించినట్లు సమాచారం. అంతే కాకుండా సీఎం ఆదేశాలతో అక్కడి పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదు చేశారు. సాధారణంగా ఒక రాష్ట్రంలో సంఘటన జరిగితే మరో రాష్ట్రంలో కేసు నమోదు కావడం అరుదు. కానీ రితీ సాహా అనుమానాస్పద మృతిపై బెంగాల్‌లో కేసు నమోదు కావడం చర్చకు దారితీస్తోంది.

కేసును నీరుగార్చే ప్రయత్నం?

రితీ సాహాను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాలేజ్, హాస్టల్ నిర్వాహకుల నుంచి స్థానిక పోలీసులు డబ్బులు తీసుకొని కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వారు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డీసీపీ విద్యాసాగర్‌నాయుడును ఆదేశించినట్లు సమాచారం.

వారంలో ఫోరెన్సిక్ నివేదిక

ఈ కేసుపై డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడును మీడియా ప్రశ్నించగా.. రితీ సాహా మృతిపై సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశామని చెప్పారు. ఫోరెన్సిక్ నివేదిక మరో వారం రోజుల్లో వస్తుందని దాని ప్రకారం తదుపరి విచారణ ఉంటుందని స్పష్టం చేశారు.

సమస్యలపై సమగ్ర చర్చ!

- ఆర్బీకేలు లేని చోట అందుబాటులో ఎరువులు
- రోడ్లకు సత్వరమే మరమ్మతులు
- జెడ్పీ సమావేశానికి హాజరైన మంత్రులు బూడి, గుడివాడ



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, వేదికపై మంత్రి అమర్‌నాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, కలెక్టర్లు రవి పట్టాన్‌శెట్టి, మల్లికార్జున, సుమిత్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. వాటికి సంబంధిత అధికారులు సమాధానాలిచ్చారు. మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. రోడ్లు, భవనాలు, వ్యవసాయం, వైద్యం, ఆరోగ్యం, జలవనరుల శాఖ తదితర శాఖలకు సంబంధించి సభ్యులు పలు విషయాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎ.మల్లికార్జున, రవి పట్టాన్‌శెట్టి, సుమిత్‌కుమార్‌లు హాజరయ్యారు. తొలుత రోడ్లు భవనాల శాఖపై చర్చ జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్లను మెరుగుపరచాలని, రోడ్ల వెంబడి చెట్ల కొమ్మలు పెరిగిపోయి వాహనాలకు ఇబ్బందికరంగా మారాయని, ఇటీవల ఘాట్‌రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదానికి చెట్ల కొమ్మలు కారణమయ్యాయని అనంతగిరి, చింతపల్లి, అరకు జెడ్పీటీసీలు గంగరాజు, పోతరాజు, రోషిణిలు తెలిపారు. దీనిపై ఆర్ అండ్‌బీ అధికారులు సమాధానమిస్తూ రోడ్ల మరమ్మతులు చేపడతామని, చెట్ల కొమ్మలు తొలగిస్తామని చెప్పారు. భీమిలి–నర్సీపట్నం రోడ్డు వెంబడి ప్రైవేటు స్థలాల్లో చెట్లను కాంట్రాక్టరు నరికేస్తున్నారని బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు స్పందిస్తూ ప్రభుత్వం జరిపిస్తున్న రీసర్వేలో రోడ్ల వెంబడి ఆక్రమణలు తేటతెల్లమవుతాయని, సరిహద్దులు నిర్ణయించాక ఆక్రమణలను తొలగించాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. తంతడి–అనకాపల్లి రోడ్డు బాగులేక ప్రమాదాలు జరగుతున్నాయని, దానిని బాగు చేయాలని పరవాడ జెడ్పీటీసీ, మునగపాక–అనకాపల్లి రోడ్ల విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు.

అనకాపల్లి జిల్లాలో 20 శాతం లోటు వర్షపాతం ఉందని, 15 మండలాల్లో వరి నాట్లు వేసే పరిస్థితి లేదని, దీంతో 8,800 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళిక రూపొందించామని, ఎరువులకు కొరత లేదని ఆ జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు తెలిపారు. ఆర్బీకేల నిర్మాణంలో ఉన్న గ్రామాల్లో ఎరువుల నిల్వలకు వీలు కాలేదని, అలాంటి చోట్ల పీఏసీఎస్‌లలో వాటిని అందుబాటులో ఉంచాలని ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు ఆదేశించారు. 108 అంబులెన్సుల్లో గర్భిణులను కేజీహెచ్‌కు తీసుకెళ్లడం లేదని, దీనివల్ల ఆ గర్భిణులు అవస్థలు పడుతున్నారని కొందరు సభ్యులు సభలో చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

కేజీహెచ్ వైద్య సేవలపై విచారణ..

ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరులో ఈనెల 17న పురుగుల మందు తాగిన అనంత్ అనే యువకుడిని కేజీహెచ్‌కు తరలిస్తే వైద్యులు సరైన వైద్యం చేయలేదని, దీంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేరిస్తే చనిపోయాడని అక్కడ జెడ్పీటీసీ కాకర దేవి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. సమావేశంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ల పనితీరు భేష్!

ప్రశంసించిన సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ముగ్గురు కలెక్టర్ల పనితీరు బాగుందని జెడ్పీటీసీలు, ఎంపీపీలు కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వీరు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లపై ప్రశంశల జల్లు కురిపించారు. తాము ప్రజా సమస్యలపై కలెక్టర్లకు ఫోన్ చేసినా, నేరుగా సంప్రదించినా సత్వరం స్పందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడడంతో పాటు అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా కృషి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ప్రజా రంజక పాలనకనుగుణంగా వీరు కూడా ఉత్తమ సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని వారు పేర్కొన్నారు.

గోస్తనీలో దూకి యువకుడి ఆత్మహత్య


మహవీర్(ఫైల్)

భీమునిపట్నం: భీమిలి వద్ద గోస్తనీలో దూకి విజయనగరంనకు చెందిన ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విజయనగరం బ్యాంకు కాలనీకి చెందిన దేవరకొండ మహవీర్(22) తుని వద్ద ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల మహవీర్ తల్లిదండ్రులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ క్రమంలో మహవీర్ నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంనకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధాప్యం.. అనుభవాల ఆస్తి


వృద్ధులతో మాట్లాడుతున్న పూర్ణిమ

కొమ్మాది: సీనియర్ సిటిజెన్‌ల అనుభవాలను నేటి యువత అందిపుచ్చుకోవాలని ఎన్‌సీపీఈడీపీ జావిద్ అబిది ఫెలో బి.కావ్య పూర్ణిమ అన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ రుషికొండ బీచ్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ సీనియర్ సిటిజెన్స్ డేలో ఆమె మాట్లాడారు. వృద్ధులు సమాజానికి మూల స్తంభాలు లాంటి వారని, వారిని విస్మరించవద్దని పిలుపునిచ్చారు. వారి నుంచి నాటి సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకోవాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం వృద్ధుల్లో మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. అనంతరం ఆమె వృద్ధులకు పలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్లూ ఫ్లాగ్, బీచ్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

టైటాన్స్‌పై రైడర్స్ గెలుపు


71 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును విజయపథాన నడిపిన టైగర్ అవినాష్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్–2 సీజన్‌లో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ– వీడీసీఏ స్టేడియంలో మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ 35 పరుగుల తేడాతో గోదావరి టైటాన్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ ఓపెనర్ ప్రణీత్ 15 పరుగులు చేసి మాధవ్ బౌలింగ్‌లో ఇస్మాయిల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కెప్టెన్ రషీద్ 7 పరుగులే చేసినా ఓపెనర్ ధరణీకుమార్(32 బంతుల్లో 59, 8X4, 3X6)తో కలిసి రెండో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం అందించాడు. హర్షవర్ధన్ (నాలుగు ఫోర్లు, సిక్సర్‌తో 22 బంతుల్లో 35)తో కలిసి లేఖజ్ రెడ్డి(12) ఇన్నింగ్స్ సరిదిద్దే ప్రయత్నం చేశాడు. 101 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయిన రైడర్స్.. మరో 63 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. మొత్తంగా తొమ్మిది వికెట్లకు 173 పరుగులు చేసింది. సత్యనారాయణ రాజు, సమన్విత్ మూడేసి వికెట్లు తీయగా మాధవ్ రెండు, విజయ్ ఒక వికెట్ తీశారు. లక్ష్య ఛేదనకు దిగిన గోదావరి టైటాన్స్ ఓపెనర్లు వంశీకృష్ణ(4) 10 పరుగుల వద్ద, కెప్టెన్ జ్ఞానేశ్వర్ (14) 28 పరుగుల వద్ద వెనుదిరిగారు. హేమంత్‌రెడ్డి ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 49 బంతుల్లో 58 పరుగులు చేశాడు. ధీరజ్‌కుమార్(10), పాండురంగ రాజు(14) వికెట్లను 94 పరుగుల స్కోర్ వద్ద కోల్పోయింది. ఇస్మాయిల్ ఎనిమిది బంతుల్లో 19 పరుగులతో చివర్లో కాస్త మెరుపులు మెరిపించినా 18.1 ఓవర్లలోనే 138 పరుగులకు గోదావరి టైటాన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. అబ్దుల్లా మూడు, సుదర్శన్, చిరంజీవి, స్టీఫెన్ రెండేసి వికెట్లు తీశారు. ఆశిష్ ఓ వికెట్ పడగొట్టాడు.

ఉత్కంఠగా వారియర్స్, టైగర్స్ మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్–2 సీజన్‌లో లీగ్ చివరి ఆడిన వైజాగ్ వారియర్స్, బెజవాడ టైగర్స్ జట్ల మధ్య పోరు ఉత్కంఠగా సాగింది. ఓపెనర్లు మూడు పరుగులకే పెవిలియన్‌కు చేరినా బెజవాడ టైగర్స్ భారీ స్కోర్‌ను అధిగమించి ప్లేఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. వైఎస్సార్ స్టేడియంలో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ నాలుగు వికెట్లు కోల్పోయి 193 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఓపెనర్లు అర్జున్(47), ప్రశాంత్ కుమార్(53) తొలి వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యం అందించారు. కెప్టెన్ కరణ్ షిండే (55) అర్ధ సెంచరీ నమోదు చేయగా.. యువన్(15) సహకారం అందించాడు. కెప్టెన్ కరణ్ అజేయంగా నిలిచాడు. సాయితేజ రెండు వికెట్లు తీయగా అఖిల్, లలిత్ మోహన్ చెరో వికెట్ పడగొట్టారు. ప్రతిగా బెజవాడ టైగర్స్ ఓపెనర్ అభినవ్ డకౌట్ గానే వెనుదిరగ్గా.. మరో ఓపెనర్ మహీప్ రెండు పరుగులకే చేతులెత్తేశాడు. మనీష్(15)ఫోర్, సిక్సర్ బాది పెవిలియన్‌కు చేరడంతో తొలి మూడు వికెట్లు 23 పరుగులకే కోల్పోయింది. ఈ దశలో షోయబ్.. రికీ బుయ్(33)తో కలిసి నాలుగో వికెట్‌కు 52 పరుగులను, అవినాష్‌తో కలిసి మరో 50 పరుగులను జోడించాడు. షోయబ్ (51) ఆరు ఫోర్లతో అర్ధసెంచరీ చేయగా సాయికుమార్, దుర్గాకుమార్ చెరో ఎనిమిదేసి పరుగులు చేశారు. చివరి ఓవర్‌లో 9 పరుగులు చేయాల్సి ఉండగా.. అవినాష్(71) అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించాడు. ఏడు వికెట్లకు 194 పరుగులతో బెజవాడ టైగర్స్ విజయం సాధించి ఎనిమిది పాయింట్లతో ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. బుధవారం జరిగే ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్ మ్యాచ్ అనంతరం ప్లే ఆఫ్‌కు మిగిలిన రెండు బెర్త్‌లు తేలిపోనున్నాయి. ఇప్పటికే 12 పాయింట్లతో రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ ప్లేఆఫ్‌కు చేరుకున్నాయి.


బంతిని బౌండరీకి తరలించి అర్ధసెంచరీ నమోదు చేసిన ధరణీకుమార్

యువతిపై లైంగిక దాడి ఆరోపణల్లో నిజం లేదు

- ఈవ్ టీజింగ్ కేసులో యువకుడిని రిమాండ్‌కు తరలించాం
- డీఎస్పీ సత్యనారాయణ వెల్లడి


మాట్లాడుతున్న అనకాపల్లి డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: పరవాడకు చెందిన ఓ యువతిని ఈ నెల 13వ తేదీ రాత్రి ఈవ్‌టీజింగ్ చేసిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అనకాపల్లి డీఎస్పీ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. పరవాడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొంతమంది ఆ యువతిపై లైంగిక దాడి జరిగిందని, దిశ చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేయలేదని ఎక్స్(ట్విట్టర్), ఫేస్‌బుక్‌లో అసత్య పోస్టులు పెడుతున్నారని.. ఇది కేవలం ఈవ్ టీజింగ్ కేసు మాత్రమేనని వెల్లడించారు. ఆ యువతి ఈ నెల 13న రాత్రి వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా ఆమె చెవి రింగ్‌లు పడిపోయాయి. వాటిని వెతుకుతుండగా.. రామాలయం వీధికి చెందిన అక్కినేని సంతోష్‌కుమార్ వాహనంపై వచ్చి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు. విచారణ చేపట్టి సోమవారం యువకుడిని అరెస్ట్ చేసి, మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. యువతిపై లైంగిక దాడికి పాల్పడినట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో పరవాడ సీఐ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

టీటీ విజేతలు శరత్, శ్రీజ


వుమెన్ సింగిల్స్‌లో పోటీ పడుతున్న క్రీడాకారిణులు

విశాఖ స్పోర్ట్స్: 50వ ఆల్ ఇండియా అంతర ఇన్‌స్టిట్యూషనల్ టీటీ చాంపియన్‌షిప్ మెన్ సింగిల్స్‌లో ఎ.శరత్ కమల్(పీఎస్‌పీబీ), వుమెన్ సింగిల్స్‌లో ఎ.శ్రీజ(ఆర్బీఐ) విజేతగా నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో షా మనుష్–దియా పరాగ్(ఆర్బీఐ), మెన్ డబుల్స్‌లో రోనిత్–ఆకాష్, వుమెన్ డబుల్స్‌లో సుదీర్తా–బైష్యా జోడీ(ఆర్‌ఎస్‌పీబీ)లు గెలుపొందాయి. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో మంగళవారంతో ముగిసిన ఈ చాంపియన్‌షిప్‌లో టీమ్, వ్యక్తిగత చాంపియన్‌షిప్ విభాగాల్లో పోటీలు జరిగాయి. మెన్‌లో 16 జట్లు, వుమెన్‌లో 13 జట్లు పోటీపడ్డాయి. టీమ్ చాంపియన్ మెన్‌లో పీఎస్‌పీబీ విజేతగా నిలవగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ రన్నరప్ సాధించింది. రిజర్వ్‌బ్యాంక్, ఆర్‌ఎస్‌పీబీ జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. వుమెన్‌లో ఆర్‌ఎస్‌పీబీ విజేతగా నిలవగా రిజర్వ్‌బ్యాంక్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, పీఎస్‌పీబీ జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ టోర్నీ ముగియగా రెండో స్థానం నుంచి ఎనిమిదో స్థానం వరకు వరుసగా మెన్ సింగిల్స్‌లో షా మనుష్, స్నేహిత్, సునీల్ శంకర్, అనిర్బన్, ఆకాష్, చంద్ర, రోనిత్, వుమెన్ సింగిల్స్‌లో మౌమిత, అర్చన, దియా పరాగ్, మనికా, లక్షిత, రిష్య, సుదీర్తా నిలిచారు.

వాహన నంబర్ ప్లేట్లపై ప్రత్యేక తనిఖీలు


నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న నంబర్ ప్లేట్‌ను తొలగిస్తున్న కానిస్టేబుల్, చిత్రంలో ఎస్‌ఐ లక్ష్మి

అల్లిపురం: ఇష్టానుసారంగా నంబర్ ప్లేట్లను వినియోగిస్తున్న వాహన యజమానులపై పోలీసులు చర్యలు చేపట్టారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్, గొల్లల పాలెం కూడలిలో మంగళవారం ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. సుమారు వంద వాహనాలను పరిశీలించి ప్లేట్లపై నంబర్‌ను సన్నటి గీతల్లో రాసినవి, కొటేషన్లు, ఇష్టమైన హీరోలు, పార్టీల నాయకుల బొమ్మలు ముద్రించిన నంబర్ ప్లేట్లను తొలగించారు. మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి వాహనచోదకులను హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొత్త ప్లేట్లను అమర్చుకోవాలని సూచించారు.

బైక్ దొంగిలించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

అక్కిరెడ్డిపాలెం: పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగిలించిన వ్యక్తికి కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. గాజువాక క్రైం ఎస్‌ఐ ఈ.మహేశ్వరరావు మంగళవారం తెలిపిన వివరాలివీ.. గంగవరానికి చెందిన కంటుముచ్చు అనీల్ 2023 మే 28న కణితి రోడ్డులోని ఫిట్‌నెస్ జిమ్ వద్దకు డ్యూక్ బైక్‌పై వచ్చి పార్క్ చేశాడు. తన స్నేహితుడి బైక్‌పై మరో ఫ్రెండ్ వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లాడు. తన బైక్ కోసం వారం రోజుల తర్వాత జిమ్ వద్దకు రాగా.. అక్కడ బైక్ కనిపించలేదు. దీనిపై గాజువాక స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన ఎస్‌ఐ ఈ.మహేశ్వరరావు బిహార్‌కు చెందిన పంకజ్ కుమార్ యాదవ్ బైక్‌ను దొంగిలించినట్లు గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్, మల్కాపురం స్టేషన్‌లో పంకజ్ కుమార్‌పై రెండు బైక్‌ల దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. దీనిపై విచారణ జరిపిన 3వ ఏసీఎంఎం కోర్టు న్యాయమూర్తి ఈ.రాజేంద్రబాబు పైవిధంగా తీర్పు చెప్పారు. ఏపీపీ టి.వాణి ఈ కేసు వాదించగా.. కానిస్టేబుల్ శివ సహకరించారని ఎస్‌ఐ మహేశ్వరరావు తెలిపారు.

సామాజిక బాధ్యతగా.. గాండీవధారి అర్జున

హీరో వరుణ్ తేజ్


చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేస్తున్న హీరోహీరోయిన్లు వరుణ్, సాక్షి

బీచ్‌రోడ్డు: సందేశం, వినోదం, యాక్షన్, ఎమోషన్‌తో కూడిన చిత్రం గాండీవధారి అర్జున అని, తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని ఆ చిత్రం హీరో వరుణ్ తేజ్ అన్నారు. నగరంలోని హోటల్‌లో మంగళవారం చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం నిర్వహించింది. కాలుష్యం, వాతావరణం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు యాక్షన్‌తో పాటు వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఈ చిత్రం చూసిన ప్రేక్షకులకు వాతావరణంపై వారి ఆలోచనల్లో కచ్చితంగా మార్పు వస్తుందన్నారు. వైజాగ్ తనకు ఎంతో ప్రత్యేకమని, ఇక్కడే నటన నేర్చుకున్నానని తెలిపారు. విశాఖ వాతావరణం చాలా బాగుంటుందని, ఇక్కడి ప్రజలు సినిమా ప్రేమికులన్నారు. రాబోయే సినిమాలో ఎయిర్ ఫోర్స్ కమాండర్‌గా నటిస్తున్నట్లు వెల్లడించారు. తనకు కాబోయే భార్యతో ఎఫ్–4 లాంటి సినిమాలో నటిస్తానని చెప్పారు. హీరోయిన్ సాక్షి వైద్య మాట్లాడుతూ విశాఖ రావడం ఇది రెండోసారి అని, వైజాగ్ చాలా అందమైన నగరమన్నారు. సమావేశంలో చిత్ర దర్శకుడు ప్రవీణ్ సత్తార్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో వరుణ్‌తేజ్ సందడి

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం గాండీవధారి అర్జున చిత్ర బృందం సందడి చేసింది. చిత్ర హీరో వరుణ్‌తేజ్, హీరోయిన్ సాక్షి వైద్య, విమలారామన్, దర్శకుడు ప్రవీణ్ సత్తారు, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ ఈ నెల 25న విడుదల అవుతున్న తమ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆదరించాలని కోరారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక అర్జునుడై లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా వారిని చూసి విద్యార్థులు కేరింతలు కొట్టారు. పోటీపడి సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేశారు.

అనుమానాస్పదంగా యూపీ వాసి మృతి

మల్కాపురం: ఉపాధి నిమిత్తం మల్కాపురం వచ్చిన ఉత్తరప్రదేశ్ చెందిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతను నివసిస్తున్న గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం బయటపడింది. మల్కాపురం సీఐ జి.డి.బాబు తెలిపిన వివరాలివీ.. ఉత్తరప్రదేశ్‌లోని కేశరిగాధీ ఖుషీనగర్ ప్రాంత వాసి మట్టురాయ్(29) ఉపాధి నిమిత్తం కొంత కాలం కిందట మల్కాపురం వచ్చాడు. హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) విస్తరణ పనుల్లో ఎల్‌అండ్‌టీ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. అతను మల్కాపురం సమీపంలోని ప్రకాష్‌నగర్ ఏడడుగుల సెంటర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కాగా.. రాయ్ ఉన్న గది నుంచి మంగళవారం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ తన సిబ్బందితో వచ్చి గదిలో రాయ్ మృతి చెందినట్లు గుర్తించారు. ఇంట్లో పరిశీలించగా మద్యం సీసాలతో పాటు నిద్రకు వాడే మందులు ఉన్నాయి. ఈ నెల 19 నుంచి అతను విధులకు వెళ్లడం లేదు. అతని ఆధార్ కార్డులోని చిరునామాకు ఈ సమాచారం ఇచ్చినట్లు సీఐ తెలిపారు. అనుమానాస్పద కేసుగా ఎస్‌ఐ దేవుడమ్మ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర ఉక్కు కార్యదర్శి పర్యటనలో స్వల్ప ఉద్రిక్తత


బైఠాయించిన కార్మిక నాయకులు

గాజువాక: కేంద్ర ఉక్కు కార్యదర్శి నరేంద్ర నాథ్ పర్యటనలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కొందరు పోలీసుల అతి వల్ల జరిగిన ఉద్రిక్తత అడ్మిన్ గేటు వద్ద బైఠాయింపునకు దారి తీసింది. పోలీసు ఉన్నతాధికారుల చొరవతో వివాదం సమసింది. మంగళవారం కార్యదర్శి పర్యటనలో భాగంగా మధ్యాహ్నం కార్మిక సంఘాలు, అసోసియేషన్లతో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరు కావడానికి వివిధ కార్మిక సంఘాల నాయకులు అడ్మిన్ భవనంలోకి ప్రవేశిస్తుండగా.. పోలీసులు కొంత మందిని మాత్రమే అనుమతిస్తామని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులతో జరిగిన వాగ్వాదంలో కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్‌లను పక్కకు నెట్టేశారు. దీంతో ఆగ్రహం చెందిన కార్మిక సంఘాల నాయకులు గేటు వద్దకు చేరుకుని బైఠాయించారు. యాజమాన్యం క్షమాపణ చెప్తేనే తప్ప సమావేశానికి హాజరు కాబోమన్నారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అక్కడికి చేరుకుని కార్మిక నాయకులతో చర్చించారు. ఫలితం లేకపోవడంతో డీసీపీ ఆనంద రెడ్డి వచ్చి నాయకుల అభిప్రాయం తెలుసుకున్నారు. ఉక్కు హెచ్‌ఆర్ అధికారులు, డీసీపీ చొరవతో డైరెక్టర్ పాండే గేటు వద్దకు వచ్చి నాయకులను సమావేశానికి తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.

డిఫెన్స్ జర్నలిజంపై అవగాహన


పాత్రికేయులకు వివిధ అంశాలను వివరిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా: జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థల నుంచి ఎంపిక చేసిన జర్నలిస్టుల కోసం తూర్పు నావికాదళంలో సోమవారం డిఫెన్స్ కరస్పాండెన్స్ కోర్సు ప్రారంభమైంది. తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా మారిటైమ్ వార్‌ఫేర్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డైరెక్టర్ జనరల్ ఎ.శరత్‌భూషణ్ బాబు డిఫెన్స్ జర్నలిజం గురించి వివరించారు. వారం రోజుల పాటు నౌకాదళ కార్యకలాపాలు, నౌకాదళ దౌత్యం, విపత్తుల సమయంలో మనవతా సహాయం, నేవీ, కోస్ట్‌గార్డ్ సంస్థాగత నిర్మాణం, నేవీకి సంబంధించి వివిధ అంశాలతో రూపొందించిన పాఠ్యాంశాలను జర్నలిస్టులకు వివరించారు. కోర్సులో భాగంగా భారత నౌకాదళ నౌక, జలాంతర్గామిని జర్నలిస్టులు సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా నేవల్ డాక్‌యార్డ్, నేవల్ ఎయిర్‌స్టేషన్, ఆన్‌బోర్డ్ కోస్ట్‌గార్డ్ షిప్‌లలో వీరు పర్యటిస్తారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. చేపల ఉప్పాడకు చెందిన మైలపల్లి శ్రీనివాస్(38) సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో తాటిచెట్లపాలెం నుంచి మద్దిలపాలెం వైపు ఆటో ను నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోర్టు ఆస్పత్రి జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఆటో పల్టీ కొట్టింది. అది శ్రీనివాస్‌పై పడటంతో తీవ్రగాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ ప్రమీల సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీ క్రికెట్ జట్టు ఘన విజయం


జీవీఎంసీ క్రికెట్ జట్టు విజయోత్సాహం

గాజువాక: జింక్ మైదానంలో జీవీఎంసీ, ఎన్టీపీసీ జట్ల మధ్య మంగళవారం నిర్వహించిన వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ పూల్ సీ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు 17 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటిగా బ్యాటింగ్ ప్రారంభించిన జీవీఎంసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టపోయి 144 పరుగులు చేసింది. జీవీఎంసీ తరఫున డి.శివ 24, సునంద్ 21, రవితేజ 22, వంకర శ్రీను 27 పరుగులు చేశారు. ఎన్టీపీసీ బౌలర్లు రవికుమార్ రెండు వికెట్లు, గంగాధర్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎన్టీపీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు నష్టపోయి 127 పరుగులు మాత్రమే చేయగలిగింది. జీవీఎంసీ కెప్టెన్ శివ నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. జి.అనిల్ రెండు వికెట్లు పడగొట్టాడు. జీవీఎంసీ జట్టును అడిషనల్ కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

ఒకటో తేదీ వరకు కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: కొత్తవలస–కోరాపుట్ సెక్షన్ గోరాపూర్–అరకు–సిమిలిగుడ స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ వరకు విశాఖ–కిరండూల్ పాసింజర్(08551), 2వ తేదీ వరకు కిరండూల్– విశాఖ పాసింజర్(08552), ఈ నెల 25, 28, సెప్టెంబర్ 1వ తేదీల్లో విశాఖపట్నం–కోరాపుట్(18512) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26, 29, సెప్టెంబర్ 2వ తేదీల్లో కోరాపుట్–విశాఖపట్నం(18511) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- అలమండ–కోరుకొండ–విజయనగరం స్టేషన్‌ల మధ్య జరుగుతున్న ఆటో సిగ్నలింగ్ పనుల కారణంగా ఈ నెల 24, 25 తేదీల్లో విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం (08546/08545) పాసింజర్, విశాఖపట్నం –రాయ్‌పూర్–విశాఖపట్నం(08528/ 08527) పాసింజర్, విశాఖపట్నం–పలాస–విశాఖపట్నం (08532 / 08531) పాసింజర్, విశాఖపట్నం–రాయగడ–విశాఖపట్నం(08504 / 08503) పాసింజర్, విశాఖపట్నం–విజయనగరం–విశాఖపట్నం(07468 / 07469) పాసింజర్, విశాఖపట్నం–పలాస–విశాఖపట్నం (07470/07471) మెమూ స్పెషల్‌ను రద్దు చేశారు.

విముఖత చూపిన వారి ఇళ్ల కేటాయింపు రద్దు

డాబాగార్డెన్స్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన పలువురు టిడ్కో(జీ+3) ఇళ్ల లబ్ధిదారులు విముఖత చూపడంతో వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేస్తామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. అనకాపల్లి జోన్ సత్యనారాయణపురం, గాజువాక జోన్‌లో అగనంపూడి, పరవాడ, పెదగంట్యాడ, భానోజీతోట, జోన్–4 పరిధిలో చిలకపేట, సీహార్స్, మధురవాడలో నిర్మించిన గృహ సముదాయాల్లో గతంలో కేటాయించిన 365, 430 ఎస్ఎఫ్‌టీ గృహాల్లో కొంత మంది లబ్ధిదారులను బ్యాంకర్స్ వారి వయసు రీత్యా తిరస్కరించడం, లబ్ధిదారులు మరణించడం, అయిష్టం చూపడం, రిజిస్ట్రేషన్‌కు రాకపోవడం తదితర కారణాల వల్ల వారి గృహ కేటాయింపులు రద్దు చేస్తామని పేర్కొన్నారు. కొత్త వారికి కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జూలై 5న జీవో 429లో తెలియజేసిందన్నారు. 365 ఎస్ఎఫ్‌టీ గల ఇళ్ల కోసం గతంలో రూ.25 వేలు చెల్లించిన వారు త్వరితగతిన రూ.3.15 లక్షలు, అలాగే 430 ఎస్ఎఫ్‌టీ గల గృహాల కోసం రూ.50 వేలు చెల్లించిన వారు రూ.3.65 లక్షలు చెల్లించి గృహాల స్వాధీన మంజూరు పత్రం తీసుకోవాలన్నారు. జీవీఎంసీ పరిధిలో నివాసం ఉండి, లబ్ధిదారుని వాటా కింద రుసుం చెల్లించి, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ప్రకారం అర్హత పొందిన వారు నమూనా దరఖాస్తుతో పాటు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు గతంలో టిడ్కో ఇళ్ల గురించి చెల్లించిన డీడీ వివరాలతో కూడిన జెరాక్స్ కాపీలతో ఈ నెల 31లోగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ)కి అందజేయాలని కమిషనర్ తెలిపారు.

ఆనందపురం ఎంఈవోపై డీఈవోకు నివేదిక

ఆనందపురం: ఆనందపురం ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై ఎంపీడీవో అడపా లవరాజు డీఈవో చంద్రకళకు నివేదిక సమర్పించారు. డీడీవో అధికారం కలిగి ఉన్న ఎంఈవో పద్మావతి ఎటువంటి సమాచారం లేకుండా ఆ విధుల నుంచి తప్పుకోవడంతో 186 మంది ఉపాధ్యాయులకు జూన్ జీతాలు నిలిచి పోయాయి. ఈ విషయమై ఉపాధ్యాయులు ఆమెను కోరినా స్పందించక పోవడంతో యూటీఎఫ్ సభ్యులు జూలై 10న స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా.. తనకు కూడా ఏప్రిల్ నుంచి డీడీవో జీత భత్యాలు అందడం లేదని ఎంఈవో పద్మావతి జూలై 21న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో విచారణ జరిపారు. జీతాల మంజూరులో ఏం జరిగిందన్న విషయమై నివేదిక ఇవ్వాలని ఆమె స్థానిక ఎంపీడీవోను కోరారు. కాగా.. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే హాజరు పట్టీలో ఎంఈవో ఈ ఏడాదిలో ఒక్క రోజు కూడా హాజరైనట్లు నమోదు కాలేదు. టూరు డైరీ వివరాలు సమర్పించలేదు. జూలై, ఆగస్టుకు సంబంధించి 11 రోజులు ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేయలేదని ఎంపీడీవో గుర్తించారు. ఆగస్టులో 13 రోజులు మాత్రమే హాజరు నమోదైన దృష్ట్యా.. ఆ రోజులకే ఆమెకు జీత భత్యాలు చెల్లించగలమని ఎంపీడీవో లవరాజు ఆ నివేదికలో పేర్కొన్నారు.